క్లుప్తంగా

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు సుశాంత్ గౌతమ్


సర్టిఫికెట్‌తో సుశాంత్ గౌతమ్

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో ఇటీవల జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల సుశాంత్ గౌతమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బాలుర అండర్- 19 విభాగం (డబుల్స్) పోటీలలో జక్కుల సుశాంత్ గౌతమ్, అభిరామ్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుపొందారు. అండర్ 19 విభాగం (సింగిల్స్) పోటీలలో వెండి పతకం సాధించాడు. రెండు విభాగాల్లో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. గురువారం విద్యార్థికి నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు. దీంతో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట రంగారావు, కోచ్‌లు లల్లు, టిల్లులు అభినందించారు.

కబడ్డీ అసోసియేషన్ మండల అడహక్ కమిటీ ఎన్నిక

మేళ్లచెరువు : మండల కేంద్రంలో కబడ్డీ అసోసియేషన్ మండల అడహక్ కమిటీని గురువారం రాష్ట్ర కమిటీ చైర్మన్ భూలోకరావు, కన్వీనర్ కర్తయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రానికి చెందిన శెట్టి రామచంద్రయ్యను అధ్యక్షుడిగా, జనరల్ సెక్రటరీగా మొర్రిమేకల భసవయ్య, కోశాధికారిగా ముడెం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్, ప్రవీణ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా మోహన్, గోపి, సభ్యులుగా బాలస్వామి, శేషం గోపి, మహేష్, రవని ఎన్నుకున్నారు.

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద అప్రమత్తంగా ఉండాలి


అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

మఠంపల్లి : అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాధికారి శ్రీనివాస్ సూచించారు. మఠంపల్లి మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణా నదిపై గల హైలెవల్ వంతెన వద్ద అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను గురువారం ఆయన తనిఖీ చేసి మట్లాడారు. గుంటూరు జిల్లా నుంచి ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణ ప్రాంతానికి రానియకుండా చెక్‌పోస్ట్‌లో కట్టుదిట్టంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం పెదవీడులో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట పోలీసులు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

అనంతగిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం అనంతగిరి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాంతినగర్ సమీపంలో రహదారిపై పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న టిప్పర్‌ను తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల వాగు నుంచి టిప్పర్‌లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు టిప్పర్ యజమాని కంతేటి త్రినేల్‌కుమార్, డ్రైవర్ వేముల వీరన్నపై కేసు నమోదు చేసి, ఇసుక టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

పాలకవీడు : ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైన సంఘటన పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధిత రైతు కందుకూరు భిక్షం తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగా పనులు ముగించుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ట్రాలీని నిలిపాడు. బుధవారం ఉదయం చూడగా ట్రాలీ కనిపించలేదు. గ్రామంలోని సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించగా ఇద్దరు దుండగులు ట్రాక్టర్ ఇంజన్‌తో ట్రాలీని తీసుకెళ్లినట్లు గుర్తించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అజోల్లా పెంపకంపై రైతులకు అవగాహన

గరిడేపల్లి : మండలంలోని మర్రికుంట గ్రామంలో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన అగ్రికల్చర్ డిగ్రీ విద్యార్థినులు గురువారం అజోల్లా పెంపకంపై రైతులకు అవగాహన కల్పించినట్లు కేవీకే శాస్త్రవేత్త డి. ఆదర్శ్ తెలిపారు. అజోల్లా నీటిపైనే పెరుగుతుందని, అజోల్లాను ఇంటి దగ్గర సంపుల్లో సులభంగా పెంచుకోవచ్చని విద్యార్థులు రైతులకు వివరించినట్లు తెలిపారు. అజోల్లా జీవన ఎరువుగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు రాంబాబు, శ్రీనివాస్, ఉపేంద్ర, సైదులు, వ్యవసాయ విద్యార్థినులు దీపిక, భవ్యవాని, భవ్య, అభిజ్ఞ, ఐశ్వర్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


హుజూర్‌నగర్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు


నడిగూడెం : ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ అజయ్‌కుమార్, తదితరులు

హుజూర్‌నగర్ : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్స్ నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తయ్య, ఎంపీడీఓ లావణ్య, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సోమమ్మ, ఐసీపీఎస్ అధికారి సాయి వంశీ, హెచ్‌ఎం జయవాణిదేవి, అంగన్‌వాడీ టీచర్ శాంతరాజ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

నషా ముక్త్ భారత్ అభియాన్‌పై గురువారం చింతపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, ఆర్‌ఐ వాసుదేవరావు, ఏపీఎం నగేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

మేళ్లచెరువు : నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని హైస్కూల్, గిరిజన గురుకుల జూనియర్ కాలేజీలో డ్రగ్స్ నిర్మూలనపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అభిమున్నీసా బేగం, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు సర్వనాశనం

గరిడేపల్లి : మాదకద్రవ్యాలు వినియోగంతో జీవితాలు సర్వనాశనం అవుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్ అన్నారు. గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాలతో దుష్పలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

చిలుకూరు : డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ ధృవకుమార్, ఎస్‌ఐ సురభి రాంబాబు గౌడ్ అన్నారు. గురువారం చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ముద్రించిన డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, డాక్టర్లు అనిల్‌కుమార్, సుభాష్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌ఉద్దీన్, అంగన్‌వాడీ టీచర్ సిరికొండ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్‌పై అవగాహన ర్యాలీ

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం నషా ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రధాన వీధులలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విజయనాయక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు జానిపాషా, కర్నాలి శ్రీధర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ



మునగాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

మునగాల : విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు వినియోగించడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మునగాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక ఉపాధ్యాయులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై ముద్రించిన పోస్టర్లు, బ్యానర్లను వారు ఆవిష్కరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

నేరేడుచర్ల : విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలని హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్‌ఐ వెన్నెల, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. గురువారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేర్వేరుగా జరిగిన నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రణతి, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజ్యలక్ష్మి, ఏ యశోద, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయురాలు.. బెజవాడ పిచ్చమ్మ


పిచ్చమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గన్నా చంద్రశేఖర్, నాయకులు

చిలుకూరు : సీపీఐ సీనియర్ నాయకురాలు, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తల్లి బెజవాడ పిచ్చమ్మ ఆదర్శప్రాయురాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో జరిగిన పిచ్చమ్మ సంతాప సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఉస్తెల సృజన, ధనుంజయనాయుడు, బద్దం కృష్ణారెడ్డి, ఉస్తెల నారాయణరెడ్డి, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, సాహెబ్ అలీ, దొడ్డా వెంకటయ్య, తమ్మనబోయిన నరేష్, తాళ్లూరి పెద మల్లయ్య, కాంగ్రెస్, సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి స్పెల్ బీ'లో తేజ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో తేజ పాఠశాల నిర్వాహకులు

కోదాడ : సాక్షి మీడియా నిర్వహించిన స్పెల్‌బీ పోటీ పరీక్షలో కోదాడ పట్టణ పరిధిలోని తేజ విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సోమిరెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రశాంత్, హాస్విక, మనస్విని, నిత్యాజీవన్, శ్రీపాద్, షేక్ అఫ్నాన్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు డిసెంబర్ 22న సాక్షి ప్రధాన కార్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు అమానుషం


నేరేడుచర్లలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

నేరేడుచర్ల : భారత రాజ్యాంగ సృష్టికర్త అంబేద్కర్‌పై పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అమానుషమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల చొక్కలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మాలమహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు గాజుల పున్నమ్మ, ఏఐఎస్‌ఎఫ్ నేత కొమ్మరాజు వెంకట్, రాజేష్, భరత్, శోభ, వాసా చైతన్య, కొడమగుండ్ల నాగరాజు, పత్తిపాటి రమేష్ తదితరులు ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించాలి

మోతె : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెల్లి సైదులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నేటి మనువాద, మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగంపై, ప్రభుత్వ రంగ సంస్థలపై దాడి జరుగుతుందని తెలిపారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

నేరేడుచర్ల : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడానికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను గురువారం నేరేడుచర్లలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వాసా పల్లయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అనిల్, సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, అంబటి భిక్షం, రజాక్, సైదులు, వినయ్, ఆనంద్, దేవయ్య, వెంకటేశ్వర్లు, సురేష్, బాబా తదితరులు ఉన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

హుజూర్‌నగర్ : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అజీజ్ పాషా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమాన పరిచిన అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు.

ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడిగా వెంకటగురుమూర్తి



మునగాల: మునగాల మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వంగవేటి వెంకటగురుమూర్తిని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్(2025 సంవత్సరానికి గాను) ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు గురువారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుళ్ల రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వెంకటగురుమూర్తి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్‌గా సేవలు అందించారు. వెంకటగురుమూర్తికి వాసవీ క్లబ్ మునగాల అధ్యక్షుడు కాపర్తి మణికంఠకుమార్, క్లబ్ సభ్యులు, పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం మునగాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, అనాథలు, మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ, ఏఎన్‌ఎం మమత, ఆశా వర్కర్ రమణ, నాగిరెడి విజయమ్మ, వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు ఎండగట్టాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశముఖ్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని మంత్రి ఉత్తమ్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన బ్లాక్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ వేల కోట్ల రూపాయలతో చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుపోవాలని చెప్పారు. వచ్చే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ తరుపున ఎవరు పోటీలో ఉన్నా వారిని గెలిపించాలని కోరారు. డిసెంబర్ 28న చింతలపాలెంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవిశెట్టి రామ్మూర్తి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రేపాకుల కోటయ్య, జ్ఞానయ్య, మక్బుల్‌పాషా, ఉస్తెల సైదిరెడ్డి, కృష్ణారెడ్డి, హనిమిరెడ్డి, అంతయ్య, పులిచింతల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


శ్రీనివాసరావు భార్యకు నగదు అందజేస్తున్న ఆర్‌ఎంపీ సంఘం నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు రాయబారపు శ్రీనివాసరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం ఆయన పెద్దకర్మ సందర్భంగా రూరల్ ఆర్‌ఎంపీల సంఘం ఆధ్వర్యంలో మృతుడి భార్యకు రూ.15వేల ఆర్థికసహాయం చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు భూతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సత్యంగౌడ్, కోశాధికారి పాలడుగు నాగరాజు, కందుల శ్రీకాంత్, ఎస్‌కె.ఖాజా, శౌరీ, అంజిరెడ్డి ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

మునగాల : గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం గత మంగళవారం హైదరాబాద్ వెళ్తున్న గ్రామపంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గురవమ్మ, కార్మిక సంఘం నాయకులు వై.పాపయ్య, వస్తం రాములమ్మ, ముత్తయ్య, భిక్షం, సీఐటీయూ నాయకులు విజయ్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కోదాడరూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేద ప్రజలకు ఓ వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి అన్నారు. మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన అల్వాల కనకతారకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఇర్ల లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ ఇర్ల నారపరెడ్డి, కాసాని సత్యం, కొండా నరసింహారావు, ఆత్కూరి రవి, అల్వాల వీరబాబు, గిరి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష


ప్రజా వేదికలో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

గరిడేపల్లి : ఉపాధి హామీ పనులను అధికారులు పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. మండలంలో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ ప్రజా వేదికను గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల వేతనాలు, పనుల మెటీరియల్స్‌కు సంబంధించిన వివరాలను తనిఖీ బృందం వివరించారు. అనంతరం శిరీష మాట్లాడుతూ.. మండలంలో 1282 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి కూలీలకు రూ.70496371 చెల్లించినట్లు పేర్కొన్నారు. మెటీరియల్‌కు రూ.3296234 ఖర్చు చేసినట్లు తనిఖీ బృందం తేల్చినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా రూ. 93500 జరిమానా విధించినట్లు తెలిపారు. రూ.1, 28981 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్, ఎంపీడీఓ సరోజ, మండల పంచాయతీ అధికారి హరిసింగ్, ఏపీఓ లింగారెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ ఆశా రాణి, ఏపీఓ సురేష్, ఈసీ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్లు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..


గణపవరం రోడ్డులో దుమ్ము లేవకుండా ట్రాక్టర్‌తో నీళ్లు చల్లిస్తున్న కాంట్రాక్టర్

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పరచగా వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో గురువారం సాక్షి దినపత్రికలో 'దుమ్ముతో ఇబ్బంది.. అధికారుల పట్టింపేదీ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రోడ్డు కాంట్రాక్టర్‌తో పాటు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ స్పందించారు. గ్రామ ప్రత్యేక అధికారి ఫోన్‌లో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై దుమ్ము లేవకుండా ప్రతి రోజు రెండు పూటలా ట్రాక్టర్‌తో నీళ్లు చల్లాలని ఆదేశించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ దుమ్ము లేవకుండా నీళ్లు చల్లుతుండడంతో గ్రామ ప్రజలకు దుమ్ము సమస్య నుంచి పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారం చూపిన సాక్షి పత్రికకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అడవుల సంరక్షణపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్

మఠంపల్లి : అడవుల సంరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెంలో ఉన్న పిట్టలసరి కోటలో ఎన్‌సీఎల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వనదర్శిని కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌వో ఆనందరెడ్డి, బీట్ అధికారి ప్రదీప్‌రెడ్డి, ఫారెస్ట్ అధికారులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఘనంగా హిందూ, ముస్లిం ఐక్యత దినోత్సవం


స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ చౌరస్తాలో సోషల్ యాక్టివిస్ట్ కన్వీనర్ షేక్.మునీర్ ఆధ్వర్యంలో గురువారం హిందూ, ముస్లిం ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1927 డిసెంబర్ 19న ఆంగ్లేయుల చేతుల్లో ఉరితీయబడిన స్వాతంత్ర్య సమరయోధులు పండిత రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాజు, భాజాన్, రాయపుడి వెంకటనారాయణ, శోభన్, ఖాజామియా, షఫీ, రఫీ, శ్రీకాంత్, నజీర్ ఉన్నారు.

వైభవంగా తిరుప్పావడ సేవ


వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మేళ్లచెరువు : మండలంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని శ్రీభూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు రామాలయంలో గురువారం తిరుప్పా వడ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నేత్ర దర్శనం, పూలంగి సేవ, స్వామివారికి అభిషేకం, పులిహోర, లడ్డూ, వడలతో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాలుగవ రోజు తిరుప్పావై పాశురం పఠించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కోదాడరూరల్ : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జిల్లా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ అన్నారు. గురువారం ఎస్సీ వర్గకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న మాల మహానాడు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పట్టణ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నాగేంద్ర, పాలపాటి సుమలత, విక్టోరియా ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమం ఆగదు


హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : అరెస్టులతో ఉద్యమం ఆగదని మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ నాయకులు అన్నారు. గురువారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఆ సంఘం నాయకులను హుజూర్‌నగర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వారు నిరసన తెలిపి మాట్లాడారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై వదలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బాబురావు, శ్రీను, బెంజిమెన్, రాములు, దయాకర్, పున్నయ్య, కళ్యాణ్, సైదులు, సావిత్రి, నరేందర్, రాజా, కోటమ్మ, రాజు, రాము, అరుణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు చోరీ


నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల పల్లె దవాఖానా వెనుక ఉన్న విద్యుత్ మోటారు బుధవారం రాత్రి చోరీకి గురైంది. నీటిలో ఉన్న మోటారును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో గురువారం పల్లె దవాఖానా వైద్యాధికారి హరినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేళ్లచెరువు : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మండలంలోని కందిబండ గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పడిదల రవికుమార్ మాట్లాడుతూ.. మాదిగలకు న్యాయం జరిగే వరకు తమ జాతిని చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కుక్కల సుధాకర్, కాటమయ్య, జానయ్య, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, స్వామి, మల్లేష్, శేఖర్, తిరుపతి, బన్నీ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బయో మెడికల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన


ఆస్పత్రిలో వైద్య సేవల గురించి అవగాహన పొందుతున్న విద్యార్థులు

మునగాల: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల బైపీసీ విద్యార్థులు గురువారం కోదాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిని సందర్శించారు. బయో మెడికల్ టెక్నాలజీపై స్వీయ అనుభవంలో భాగంగా ఆస్పత్రిలో వివిధ పరికరాల గురించి, వ్యాధుల నివారణలో వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నారు. అనంతరం బయో మెడికల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్ తెలిపారు. టీచర్లు పి.వెంకటేశ్వర్లు, జాకీర్‌హుస్సేన్, డాక్టర్లు దాసరి బాలాజీ, గొర్రె శ్రీకాంత్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.